కథ

# పద్దూ పెళ్ళి

- కపిలసాయి మోహన్‌దాస్

**'జోరుగా** హుషారుగా.... లలాల్ల లాల్లలా...'' ఆఫీసులో అడుగుపెడుతున్న పద్మనాభాన్ని 'ఏంటోయ్ పద్దూ అంత హుషారు? కొంపతీసి నీ స్వప్న సుందరిగాని కనిపించలేదు కదా!' అంటూ కొలీగ్ మోహన్రావు వ్యంగ్యంగా అడిగాడు. 'పద్దూ- ఒకస్వప్న సుందరి - కనిపించటం - ఇవి మన జనరేషన్‌కి తీరని కోరికే !' ఇంకొందరి తీర్మానం.

'అదేం - భామ భామకొక బావగారిని, బావ, బావకొక భామామణిని' అంటూ సినిమా పాటలో లాగా ఎక్కడో, ఎవరో వుండే వుంటారు''- సీనియరు కొలీగు బాలనాగమ్మ జోస్యం!

పద్దూకైతే యివేమీ పట్టటం లేదు! తన ఆనందాన్ని కొలీగ్సుతో పంచుకోవాలి! - 'నిన్న అమ్మమ్మకి వుత్తరం వచ్చింది' అంటూ చూపించాడు. చాలా చక్కని దస్తూరితో వుంది.... 'సీతమ్మగారికి - నమస్కారములు - మీ గురించి, మీరు సంబంధాలు చూస్తున్న మీ మనవడి గురించి విన్నాను. మూడు దశాబ్దాల నా మనుమరాలు మాత్రమే మూడు పుష్కరాల మీ వాడికి సరిజోడనిపిస్తోంది, మీరొకసారి చూసి పోగలరు - బామ్మ ఇదీ మేటరు!

'బామ్మ ఏమిటోయ్, యూనివర్సల్ బామ్మలాగా! తల్లి, తండ్రి వగైరాలేరటా?' మోహన్రావు ఆరాలు. పద్దూ నోరు విప్పాడు... 'బామ్మ దగ్గర వుంటోందట. పేరు వాసవిట - తండ్రీ, తల్లీ వేరే వూళ్లోట. బామ్మ ఎంత చెపితే అంతేనట! అమ్మమ్మ నిన్న వాళ్ళ యింటికి వెళ్ళిందట - ఆ టైములో బామ్మ లేదుట. ఈ పిల్లే వుందట. తెగ మర్యాద చేసిందట. అమ్మమ్మ ఛాదస్తానికి తగ్గట్టు వుందట. పైగా ఆవడలు చేసి పెట్టిందట. అవంటే అమ్మమ్మకి ఇష్టం అని చెప్పాను కదా! కొసరి కొసరి తినిపించిందట. 'ఓ పాట పాడమ్మా' అనగానే రామదాసు కీర్తన అందుకుందట... ''నను బ్రోవమని చెప్పవే.... సీతమ్మతల్లీ'' అసలే ఆవడలు - ఆపైన తన పేరుతోనే కీర్తన! అమ్మమ్మ అయిసయి, కరిగి ''నా మనవడికి నీతోనే పెళ్ళి జరిపిస్తా...'' అంటూ శపథం చేసిందట. ఇవ్వాళే నేను వెళ్ళి చూస్తాను... మనసులో వున్నదంతా కక్కేశాడు పద్దూ! 'సో.... రేపు స్వీటుతో వస్తావన్నమాట...' మోహన్రావు మాటలు వినపడటంలేదు.

ఈలోగా మనం కథలో కెడితే- కేంద్ర ప్రభుత్వ కార్యాలయంలో పని చేస్తున్న చిరుద్యోగి పద్మనాభానికి పెళ్ళి అంటే చాలా, ఖచ్చితమైన అభిప్రాయాలే వున్నాయి- పిల్ల మరీ అందంగా వుండకూడదు (భార్యా రూపవతీ శత్రుః అన్నారు) అలా అని వికారంగానూ వుండకూడదు (తన పక్కన వుండే అర్హత వుండాలి) తనకంటే ఎక్కువ చదవకూడదు (తను తెలుగు మీడియంతో డిగ్రీ - ఎక్కువయితే చులకన చెయ్యొచ్చు) ఏదో చిరుద్యోగం దొరికే చదువుండాలి. (తన జీతంతో పూర్తి సంసారం ఎన్నాళ్ళు నడుస్తుంది?)

వంటావార్పు వచ్చివుండాలి. సరే ఇక జాతకాలు ఎట్సెట్రా వుండనే వున్నాయి. వీటితో... తనకు నచ్చిన పిల్ల కోసం తన ఇరవై నాలుగో ఏటనే వేట మొదలెట్టాడు. కానీ... పుష్కర కాలం గడిచింది... డజన్లకొద్దీ సంబంధాలు చూపారు తన కొలీగ్సు. అన్నీ ఎక్కడో అక్కడ ఫెయిలే! తను చూసి వద్దనుకున్న వాళ్ళకి పెళ్ళిళ్ళయి వాళ్ళ పిల్లలు కాలేజీ చదువులదాకా కూడా వస్తున్నారు.

మర్నాడు స్వీటు లేకుండా వచ్చిన పద్దూని ''ఏంటోయ్... ఇదీ డౌటేనా...?'' మోహన్రావు అనుమానంగా అడిగాడు.''

'డౌటు లేదు - ఇదీ ఫెయిల్....' తక్కినవారి కోరస్.

బాలనాగమ్మ లేదు - కాబట్టి నో కామెంటు!

పద్దూ చెప్పాడు ''నేను ఇంటికి వెళ్ళి ముస్తాబై, ఎలా మాట్లాడాలో ప్రిపేరయి వెళ్ళేప్పటికి లేటయింది. నేను తలుపు తట్టాను. నేను సిగ్గుపడుతూనే వెళ్ళాను కానీ వాళ్ళ బామ్మే సిగ్గు లేకుండా... లోపలి నుంచే ఇంత రాత్రయితే రానీయనని తెగేసి చెప్పింది. ఇవాళ పర్మిషన్ తీసుకుని మధ్యాహ్నం వెడతాను'' పద్దూలో హుషారు తగ్గలేదు.... ఇంటికెళ్ళాడు.

'కాశీకో, రామేశ్వరానికో వెళ్ళండి'. అంటూ వాసూ చేతికి కాష్ హాండోవర్ చేశాడు. ప్రశాంతంగావింది బామ్మ!

తరువాతి రోజు డీలాపడ్డ పద్దూనే మొదలెట్టాడు... 'వాళ్ళ యింటికి పెందలాడే వెళ్ళాను... తనే తలుపు తీసింది - నామనసుని కూడా తెరచినట్టయింది.... ఇంతలో 'ఒరే వాసూ! ఎవరే వచ్చింది' అంటూ వాళ్ళ బామ్మ లోపలి నుంచే అడిగింది. ఏదో అడుగుతోంది. నాకేమో వాసవితో మాట్లాడదామని ఇక మొహమాటంతోనే అనేశాను - "మీరు నాకు నచ్చారు - నేను నచ్చానా " అంటూ! 'నే సచ్చటమేమి టబ్బాయ్? మా వాసూకి సంబంధం చూస్తున్నా, నాకు నచ్చితేనే మీకు సెటిల్ చేస్తాను' అంటూ లోపలి నుంచి వాళ్ళ బామ్మ అంటోంది. నెమ్మదిగా ఏదో మాట్లాడాలని అన్నాను 'పేరు మాత్రం మొగపేరులా లేదూ?' వెంటనే తను 'మీరు మాత్రం పద్దూ కాదేం...' అని 'మాయాబజారు' లో మాయా శశిరేఖ గెటప్ లో సావిత్రిలా ఉంది. ఎంతో ముచ్చట వేసింది. 'ఇంతకీ నేన్నచ్చానా' తను రెట్టించాడు. ''బామ్మనడిగి చెపుతా''నంటూ వాసవి సమాధానం. ఇంతలో లోపలి నుంచి యిన్స్ట్రక్షన్స్. 'కావాలంటే రేపు మళ్ళీ రావచ్చు' లేటు అవుతోంది... ఇక వెళ్ళి రమ్మనవే వాసూ!' బామ్మ మాటలకి అయిష్టంగానే బయటికొచ్చాడు.

'ఆశ వుందంటావా?' మోహన్రావు అనుమానం.

'ఇంకానా - లాభం లేదు' తక్కినవాళ్ళ పునరుద్ఘాటన!

'మనం పాజిటివ్‌గా ఆలోచించాలి పిల్ల నీకు నచ్చింది. మీ అమ్మమ్మకి నచ్చింది. ఎటొచ్చి బామ్మదేగా 'ఓవరు ఏక్షన్' రేపు మళ్ళీ వెళ్ళు....' బాలనాగమ్మ హితోపదేశం!

మళ్ళీ వెళ్ళిన పద్దూకి మొహమాటం చాలా వరకు తగ్గింది. 'బామ్మగారిని చూడాలని వుందన్నాడు. బామ్మ మాత్రం బ్రహ్మచారులకి కనపడదుట! ఈ రోజుల్లో కూడా ఇంత సాంప్రదాయాలున్నవాళ్ళా? బామ్మ అంటే భయం స్థానంలో గౌరవం వచ్చింది. సరే టైం పాసవాలిగా... 'వాసూ నువ్వు చాలా బాగా పాడతావని అమ్మమ్మ చెప్పింది- కీర్తనలు కాకుండా సినిమా పాట పాడతావా?' చాలా జాలిగా అడిగాడు. 'నే రాసిన పాట పాడరా వాసూ' అంటూ లోపలి నుంచి బుక్కు విసిరింది బామ్మ! పేజీ తీసిన వాసూ తీయని గళం విప్పింది....'బట్ట లేక చూశా నీకై బట్ట లేక చూశా నీకై....' త్రుళ్ళిపడ్డాడు పద్దూ! 'సినీ కవుల్ని సైతం తలదన్నిన అశ్లీలం! ఛీ! ఏమిటి వీళ్ళ సంస్కారం?' ఇంత వయసులో బామ్మరాసే పాటలా? ఛీ సిగ్గు వుండక్కరలేదా?' ఆవేశంగా మొహం మీదే అడిగాడు. 'బామ్మా' అంటూ వాసూ బావురుమంది. బామ్మ కాళికా అవతారం ఎత్తింది - 'ఏమిటోయ్ నీ సంస్కారం - చరణం మధ్యలోంచి పాడిందది - ముందు పేజీ చూడు - 'దుఃఖమును' అని ఓ భక్తురాలు దేవుడి కోసం మొం పెట్టుతున్న పాటలో అశ్లీలం కనిపించిందా? ఆ మాత్రం ఇంగితం లేకుండా వుద్యోగం ఏం చేస్తున్నావ్? అసలు బూతు మాటలు మా వంశంలో ఎరుగుదుమా?... ఆ మాటకొస్తే... బార్య, భర్త దగ్గరగా కూడా వుండం. మా నాన్నకి నేను పెంపుడు, నాకు నా కొడుకు.... వాడికి వాసూ కూడా పెంపుడే!'' ఆవేశంతో, ఆయాసంతో మాటలాగి పోయాయి. రొప్పటం వినపడుతోంది. తనది చాలా తొందరపాటు... కొంచెం ఓపిక పట్టాల్సింది....' సారీ' అని చెప్పాడు! ఈ సారికి తప్పక క్షమించండి' అని వెను తిరిగి చూడకుండా యింటికి వచ్చాడు!

జరిగింది విని నిద్రమాత్రల సీసా తీసింది అమ్మమ్మ! ఇక పెళ్ళియోగం లేదంది. మాత్రలు మింగి ఛస్తానంటోంది. ఆమెని సముదాయించి, నిద్రపోదామంటే బావురుమంటున్న వాసవి మొహం నిద్ర రానీకుండా చేసింది.

ఇదీ పద్దూ పడుతున్న యాతన! అన్నీ నచ్చాయనుకున్న సమయంలో ఇక ప్రాబ్లెమ్ సాల్వయిందనుకున్న టైముకి ఎన్ని అపశృతులు? ఎన్ని ఆటంకాలు! కొలీగ్సు భారంగా నిట్టూర్చారు. ఏదైనా

వంటావార్పు వచ్చివుండాలి. సరే ఇక జాతకాలు ఎట్సెట్రా వుండనే వున్నాయి. వీటితో... తనకు నచ్చిన పిల్ల కోసం తన ఇరవై నాలుగో ఏటనే వేట మొదలెట్టాడు. కానీ... పుష్కర కాలం గడిచింది... డజన్లకొద్దీ సంబంధాలు చూపారు తన కొలీగ్సు. అన్నీ ఎక్కడో అక్కడ ఫెయిలే!

పథకం వేసి పెళ్ళి జరిగేలా చూడాలని 'మోహన్రావు తీవ్రంగా ఆలోచించాడు. ''పెళ్ళైనా ఆ బామ్మ సంసారం చేయనిస్తుందా? అందరూ పెంపుడు అంటే సంసారాలున్నట్టా?'' పద్దూ మథన చూసిన బాలనాగమ్మ దృఢంగా అంది 'నీకు అన్ని విధాల తృప్తిగా వుంటే మార్గాలనేకం! నీకు పూర్తిగా యిష్టమేనా?'

'ఇంకా అనుమానమా? - నేను తననే చేసు కుంటా' పద్దూ స్పష్టం చేశాడు.

'అయితే ఆ పిల్లకీ యిష్టమైనట్టే అనిపిస్తోంది. ఎటొచ్చీ బామ్మేగా అడ్డం! ఆవిడని కొన్నాళ్ళు పిలిగ్రిమేజ్కి పంపే ఏర్పాటు చేద్దాం! మేం ఎలాగూ నీకు గిఫ్ట్ ఇవ్వాలిగా! అది డబ్బు రూపంలో ఇస్తాం - నువ్వు ఆవిడని సముదాయించి ఆ మనీని ఆవిడకిస్తే - ఆవిడ అలక కూడా పోతుంది! ఈలోగా వాళ్ళ అమ్మా నాన్నలకి కబురు చేసి పెళ్ళి జరిపించేయొచ్చు తరువాత అన్నీ సవ్యంగానే వుంటాయి?'' బాలనాగమ్మ సలహా అందరికీ నచ్చింది. పద్దూకైతే సాక్షాత్తూ బాలాదేవిలా కనిపించింది బాలనాగమ్మ.

తరువాత పద్దూ వాసవి ఇంటికి వెళ్ళాడు. పొగడగా పొగడగా బామ్మగారు లోనికి రానిచ్చి కూర్చోటానికి అనుమతించింది. అసలు విషయానికొచ్చి, తను చేసిన పాపానికి పరిహారంగా ఆవిడ చేత యాత్రలు చేయించాల నుందన్నాడు. 'కాశీకో, రామేశ్వరానికో వెళ్ళండి' అంటూ వాసూ చేతికి కాష్ హాండోవర్ చేశాడు. ప్రశాంతంగావింది బామ్మ! నిజమే తనూ తిరగాలంది. కానీ మళ్ళీ జన్మంటూ వుంటే అప్పుడు కాశీ వెడతాను. ఇప్పుడు మాత్రం ఎవరినైనా తోడు తీసుకుని గోవా వెళ్ళాలనుంది- రేపే బుక్ చేయిస్తానంది.

మనసులో కసి ! ముసిల్దానికి గోవా మీద మనసు! కానీ బైట పడితే తను మునిగిపోతాడే! ముందావిడ వెళ్ళిపోతే ! తనకు శాంతి.

బామ్మ వెళ్ళిందని తెల్సింది. వాసూని చూడాలనిపించి వెళ్ళాడు. 'మీ బామ్మ వెళ్ళిందిగా ఇక ఫ్రీగా వుండు' అన్నాడు! మళ్ళీ తొందరగానే వచ్చేస్తానం'దని ఆనందంగా చెప్పింది వాసు! తనని లాలనగా అడిగాడు 'మీ బామ్మ నన్ను వదిలెయ్యమంటే వెంటనే వదిలేస్తావా?' 'ఊఁ హూఁ' అడ్డంగా తల తిప్పింది. ఆనందంతో తాను మురిసే లోపుగానే 'వెంటనే' అని బామ్మ చెపితేనే...' అన్న ముక్తాయింపులో సుడిగుండంలో వున్న ఫీలింగ్.

అంతా కలిసి అతి తొందరలో లగ్నం పెట్టించారు! బామ్మ ఇన్ఫ్లూయన్సు పడకుండా పెళ్ళి జరగాలి.

పెళ్ళిరోజు వచ్చింది. తాళి కడుతూ వాసవి చెవిలో 'బామ్మ లేకుండానే మన పెళ్ళి ముగిసింది...' ఆనందంతో అంటున్న పద్దూతో అంతే ఆనందంతో ''అదుగో బామ్మ'' అంటూ బదులిచ్చింది వాసు. అదిరిపడ్డ పద్దు ఎదురుగా చూశాడు.

ఎదురుగా వున్నది... ఇన్నాళ్ళూ బామ్మలా నటించిన బాలనాగమ్మ? జీవితం విలువ తెలీకుండా వృధా చేసుకుంటున్న పద్దూని దారిలో పెట్టాలని ఆడిన డ్రామా!

'వాసవి ఎవరో కాదు - నా కజిన్' బా...మ్మగా వున్న బాలనాగమ్మ చెప్పింది. నిన్ను ఒక ఇంటివాడిని చేద్దామని, నీకు, వాసూకి నిజమైన అభిమానాలు వున్నాయా అని తెలుసుకోవటం కోసం నాటకం ఆడినందుకు సారీ!

'ఇవిగో మీకు హనీమూన్ ట్రిప్కోసం - గోవా టిక్కెట్లు- మా ఆఫీసు తరపున గిఫ్ట్' అంటూ, చేతి కందించిన టిక్కెట్లు - అమ్మవారు తనకి ప్రసాదంలా ఇచ్చినట్టు బాలనాగమ్మ అమ్మవారిలా కనిపించారు పద్దూకి. చెవిలో నెమ్మదిగా అంది 'వాళ్ళలో పెంపుడు ఎవరూ లేరులే'

పద్దూ ఒక ఇంటివాడయ్యాడు.

***